సాక్షి మహబూబ్‌నగర్

శనివారం : 6 : జనవరి : 2024



..ఆదాయం రూ.2.53 కోట్లు

కురుమూర్తిస్వామి జాతర పురస్కరించుకొని రూ.2.53 కోట్ల ఆదాయం వచ్చింది.

వివరాలు 10లో ▸



అలంపూర్‌పై ప్రచారం కరువు

చారిత్రాత్మకమైన అలంపూర్ ఆలయాలపై ప్రచారం చేసేవారే కరువయ్యారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 32.6 /15.1

వాతావరణం

చలి ప్రభావం అధికంగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

రెప్పపాటులో విషాదం

డీసీఎం ఢీకొన్న ఘటనలో తల్లీకూతురు, ఓ బాలుడు, మరో మహిళ, చిన్నారి దుర్మరణం





చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

వారాంతపు సంతలో కూరగాయలు కొని ఇంటికి వెళ్తున్న ఓ కుటుంబం.. రోడ్డు అవతలి వైపు ఉన్న తండ్రి దగ్గరికి వెళ్తూ ఓ కుమారుడు.. తన వారి కోసం ఎదురుచూస్తున్న ఓ వలస కార్మికుడు.. వీరి ఆశలు, ఆశయాలు.. బంధాలు, బంధుత్వాలు.. రెప్పపాటులో జరిగిన ఒక్క ప్రమాదంతో అంధకారంలో కూరుకుపోయాయి.. ఊహించని రీతిలో మృత్యుశకటంలా దూసుకొచ్చిన డీసీఎం వీరి జీవితాలను చిన్నాభిన్నం చేశాయి. ఐదుగురు పొట్టనబెట్టుకున్న ఈ దుర్ఘటన ఓ భర్తకు భార్యాకూతురిని, ఇంకో తండ్రికి కుమారుడిని, మరో దంపతులకు కూతురిని, ఓ కుటుంబానికి ఇంటి పెద్దదిక్కు (మహిళ)ను దూరం చేసింది.

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- కోపోద్రిక్తులైన స్థానికులు.. డీసీఎం దగ్ధం, పోలీసులపై దాడి
- 10 కి.మీ., మేర నిలిచిన ట్రాఫిక్.. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- నిత్యం ప్రమాదాలకు నిలయమైన బాలానగర్ కూడలి

జడ్చర్ల/బాలానగర్/మహబూబ్‌నగర్ క్రైం: నిత్య ప్రమాదాలకు నిలయమైన బాలానగర్ కూడలి శుక్రవారం సాయంత్రం రణరంగంగా మారింది. వారాంతపు సంతలో కూరగాయలు కొని స్వగ్రామం మోతీఘనపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యాభర్తలు వంగూరు రాజు, సునీత(32), కూతురు పింకి అలియాస్ మోక్షిత(10), రోడ్డుకు ఆవతలివైపు ఫొటోస్టూడియోలో ఉన్న తండ్రి దగ్గరికి వెళ్తున్న బాలానగర్‌కు చెందిన జశ్వంత్(10), రోడ్డు దాటుతున్న రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బీబీనగర్ తండాకు చెందిన పన్ని(50), సేవియాతండాకు చెందిన జున్ను(3), మౌనికతో పాటు రోడ్డు పక్కన నిల్చొన్న వలస కూలీ, మధ్యప్రదేశ్ రాష్ట్రం అనుపూర్ జిల్లాకు చెందిన భద్రుసింగ్‌లను వేగంగా దూసుకొచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనతో తీవ్ర కోపోద్రిక్తులై ఉద్రిక్తత పరిస్థితులు సృష్టించారు. మృతులు, క్షతగ్రాతులు సాధారణ కుటుంబాలు కాగా.. ప్రమాదంతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

రక్తసిక్తమైన రహదారి..

బాలానగర్ కూడలిలో అకస్మాత్తుగా వచ్చిన ఆటోను గమనించిన డీసీఎం డ్రైవర్ దానిని తప్పించబోయి రోడ్డు దాటుతున్న వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోగా.. క్షతగాత్రుల హాహాకారాలు, స్థానికుల కేకలతో భీతావాహ వాతావరణం నెలకొంది. కూడలి మొత్తం రక్తసిక్తంగా మారింది. కళ్ల ముందు తమవారు విగతజీవులుగా పడి ఉండటంతో బోరున విలపించగా.. స్థానికులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే తేరుకొని 108 అంబులెన్స్‌లలో క్షతగాత్రులను పంపించారు. రెప్పపాటులో చోటుచేసుకున్న ప్రమాదంతో ఐదుగురు మృతి చెందడం, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడటం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన మృతులు, క్షతగాత్రులు

ఆగ్రహంతో ఆందోళన..

బాలానగర్ కూడలిలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా కనీసం ఒక్క పోలీసునైనా ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రజలు నిలదీశారు. సంఘటన స్థలానికి వచ్చిన జడ్చర్ల రూరల్ సీఐ, రాజాపూర్ ఎస్‌ఐలతో పాటు సిబ్బందిని వెంబడించి మరీ దాడి చేశారు. దీంతో పోలీసులు సమీపంలోని టైలర్ షాపులోకి వెళ్లి.. షెటర్ వేసుకుని అక్కడ ఉన్న వేరే దుస్తులు వేసుకుని ఆందోళనకారుల నుంచి తప్పించుకున్నారు. కొందరు స్థానికులే పోలీసులు దుస్తులు ఇచ్చి సహకరించడంతో వారు ఎలాంటి ప్రమాదం లేకుండా బయటకు రాగలిగారు. జాతీయ రహదారిపై వేగ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తపరిచారు. కనీసం బారికేడ్లు ఉన్నా ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు ఆక్రోశించారు.



ఆగ్రహంతో డీసీఎంపై దాడి చేస్తున్న జనం

నిర్లక్ష్యపు డ్రైవింగ్.. పోలీసుల అజాగ్రత్త..

పేరుకేమో జాతీయ రహదారి–44.. అందులోనూ మండల కేంద్రంలో మూడు రహదారులను కలిపే ముఖ్యమైన కూడలి.. ఈ క్రమంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తే.. వందలాది మంది ప్రజలు తమ అవసరాల కోసం రోడ్డుపై అటు ఇటు తిరుగుతుంటారు. ఇక శుక్రవారం జరిగే వారాంతపు సంతలో కూడలి మొత్తం ప్రజలతో కిటకిటలాడుతుంది. ఈ క్రమంలో కొందరు వాహనదారుల నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రజల అజాగ్రత్త కారణంగా బాలానగర్ కూడలి నిత్య ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫలితంగా ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో పదుల సంఖ్యలో మృతిచెందగా.. వందల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. కానీ, ఇటు జాతీయ రహదారి అధికారులతోపాటు అటు పోలీసులు సైతం తమ పరిధిలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. వేగ నిరోధకాలతో పాటు.. ట్రాఫిక్ నియంత్రణకు ఒక్క పోలీసును కూడా అందుబాటులో ఉంచకపోవడంతో ప్రమాదాలకు అడ్డుకట్ట పడటం లేదన్న వాదన వినిపిస్తోంది.

ఉస్మానియాకు తరలింపు

బాలానగర్ చౌరస్తా దగ్గర శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మౌనిక, భద్రుసింగ్‌లకు జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అయితే భద్రుసింగ్ తలకు తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో ఉస్మానియాకు రెఫర్ చేశారు. మౌనికకు సైతం కడుపులో పేగులు పూర్తిగా బయటకు వచ్చాయని, ఆమె పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ జీవన్ వెల్లడించారు. దీంతో ఆమెను కూడా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ రెఫర్ చేస్తామన్నారు. గాయపడిన మరో వ్యక్తిని షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

కలెక్టర్ పరామర్శ

బాలానగర్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రవినాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మౌనిక, భద్రుసింగ్‌లను కలెక్టర్ పరామర్శించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కృష్ణ, ఆర్డీఓ అనిల్‌కుమార్ మృతులతోపాటు గాయపడిన వారి వివరాలు సేకరించారు.



జనరల్ ఆస్పత్రిలో క్షతగాత్రుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ రవినాయక్



జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



జనం దాడి చేసేందుకు ప్రయత్నించడంతో టైలర్ షాపులోకి వెళ్లిన పోలీసులు



ఫైరింజన్‌ను అడ్డుకున్న స్థానికులు

న్యూస్‌రీల్

పాలమూరు, భూత్పూర్‌కు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఏటా కేంద్ర ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీలను వివిధ కేటగిరీల్లో ఎంపిక చేస్తుంది. 2022 సంవత్సరంలో పాలమూరు మున్సిపాలిటీ ఓడీఎఫ్ (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) ప్లస్‌కు ఎంపికైన విషయం విదితమే. తాజాగా 2023 సంవత్సరంలో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ కు ఎంపికై ంది. అలాగే జిల్లాలోని భూత్పూర్ మున్సిపాలిటీ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్, జడ్చర్ల ఓడీఎఫ్ ప్లస్‌కు ఎంపికయ్యాయి.

మరొకరికి కోవిడ్

పాలమూరు: జిల్లాలో కరోనా అనుమానితులు పెరగడంతో పాటు పాజిటివ్ కేసులు సైతం క్రమంగా పెరుగుతున్నాయి. జిల్లా జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం మొత్తం 107 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా ఒకరికి పాజిటివ్ వచ్చింది. ఇక జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 745 మంది అనుమానితులకు పరీక్షలు చేయగా 11మందికి పాజిటివ్ వచ్చింది.

పార్టీ మారిన కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు బి.రమాదేవి (39వ వార్డు), ఎ.ఆనంద్‌గౌడ్ (21వ వార్డు), బురుజు సుధాకర్‌రెడ్డి (43వ వార్డు), డి.లతాశ్రీ (15వ వార్డు)లపై అనర్హత వేటు వేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు తెలిపారు. శుక్రవారం న్యూటౌన్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ ద్వారా లబ్ధి పొందిన వారు నమ్మక ద్రోహం చేశారని విమర్శించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడంతో ఇదే అదునుగా తీసుకుని తమపై దొడ్డి దారిన అవిశ్వాసం పెట్టాలని చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన కౌన్సిలర్లకు విప్ జారీ చేస్తామని, పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరైనా ఓటువేస్తే వారిపై న్యాయపరంగా ముందుకు వెళ్తామన్నారు. తమ పార్టీ కౌన్సిలర్లకు కొందరు కాంగ్రెస్ నాయకులు డబ్బు ఎరగా చూపి అవిశ్వాసం కోసం యత్నిస్తున్నారని ఆరోపించారు. పట్టణ ప్రజల బాగోగులను పట్టించుకోకుండా వ్యక్తిగత అవసరాల కోసం కొందరు కౌన్సిలర్లు ఆలోచించడం సరికాదన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, కౌన్సిలర్లు రావుల అనంతరెడ్డి, వేదవ్రత్, రాము, శ్రీనివాసులు, మూషా నరేందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్‌కు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గ్రూప్–1,2,3,4 పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈనెల 8 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిరా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు మెట్టుగడ్డలో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌ను సంప్రదించాలని సూచించారు.

కందులు క్వింటాల్ రూ.8,661

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.8,661, కనిష్టంగా రూ.8,169 ధర లభించింది. అదేవిధంగా వేరుశనగ క్వింటా గరిష్టంగా రూ.8,209, కనిష్టంగా రూ.5,292, ఆర్‌ఎన్‌ఆర్ వరి ధాన్యం క్వింటాలు గరిష్టంగా రూ.3,134, కనిష్టంగా రూ.2,839, హంస రకానికి గరిష్టంగా రూ.2,125, కనిష్టంగా రూ.2,081, మొక్కజొన్నకు రూ.2,170 చొప్పున వచ్చాయి.

తెల్ల కుసుమలు క్వింటా రూ.4,221

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో తెల్ల కుసుమలు క్వింటా గరిష్టం, కనిష్టంగా రూ.4,221 ధరలు పలికాయి. అలాగే, తెల్ల కందులు గరిష్టం రూ.9,572, కనిష్టం రూ.9,209, ఎర్ర కందులు గరిష్టంగా రూ.9,379, కనిష్టం రూ.7,225, వడ్లు సోనా గరిష్ట, కనిష్టంగా రూ.2,730, వడ్లు హంస గరిష్ట, కనిష్టంగా రూ. 2,240 ధరలు పలికాయి.

రేపు సగర సేవా సమితి రాష్ట్ర ఆవిర్భావసభ

నాగర్‌కర్నూల్: సగర సేవాసమితి రాష్ట్ర ఆవిర్భావ సభ ఆదివారం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సమాజానికి తిరిగి అందించు' అనే సామాజిక న్యాయ సూత్రం ప్రకారం.. సగరులలో ఉన్నత స్థాయికి ఎదిగిన ఉద్యోగులు, విద్యావంతులు తోటి సగరులకు తమవంతు సహాయం అందించేందుకే సగర సేవా సమితిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆవిర్భావసభకు ఉద్యోగులు, విద్యావంతులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముమ్మరంగా ప్రజాపాలన సభలు



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు శుక్రవారం కొనసాగాయి. ఆరు గ్యారంటీల అమలు కోసం గ్రామ, వార్డు సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో జనాలు పెద్దఎత్తున వస్తున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు శనివారం మాత్రమే గడువు ఉంది. ఈ క్రమంలో గ్రామ, వార్డు సభలను కలెక్టర్ రవినాయక్ ఆకస్మికంగా తనిఖీ చేస్తూ అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణతోపాటు కౌంటర్ల వద్ద ఫారాల పంపిణీ, ఫారాలను పూరింపును పరిశీలించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. శుక్రవారం నాటికి జిల్లావ్యాప్తంగా గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో 493 సభలు నిర్వహించగా.. మొత్తం 2,36,370 దరఖాస్తులు వచ్చాయి. అంతేకాకుండా మరో 48,094 దరఖాస్తులు ఇతర సమస్యలపై వచ్చాయి.

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజాపాలన దరఖాస్తులన్నింటిని ఎలాంటి తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం ద్వారా పూర్తి పారదర్శకత ఏర్పడుతుందన్నారు. గ్యారంటీ పథకాల అమలు కోసం తీసుకున్న ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎలాంటి తప్పులు లేకుండా సరిచూసుకోవాల్నారు. ప్రభుత్వం తరపున అవసరమైన కంప్యూటర్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని, ఆపరేటర్లకు సహాయకులను సైతం నియమిస్తామన్నారు. ముఖ్యంగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా కౌంటర్ల ఇన్‌చార్జ్‌లు ఎవరో ఒకరు డాటాను నమోదు చేసేందుకు సహకరిస్తారన్నారు. జిల్లాలో స్వీకరించిన దరఖాస్తులను డేటా ఎంటర్ చేసేందుకు 46 బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందానికి ఒక్కో లాగిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కో డాటా ఎంట్రీ ఆపరేటర్ కనీసం 5 దరఖాస్తులను నమోదు చేయాలని, దీంతో ఏమైనా సమస్యలుంటే సరి చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు ఎట్టిపరిస్థితుల్లో బయటికి వెళ్లకూడదని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఆర్డీఓ అనిల్ కుమార్, ఈడీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు..

మండలం	గ్రామాలు	ని.స.	ఇ.వ.వ.ద.	ఇ.స.వ.
అడ్డాకుల	17	17	9,169	2,425
బాలానగర్	37	31	10,030	2,670
భూత్పూర్	18	18	9,444	2,345
చిన్నచింతకుంట	18	18	11,150	1363
దేవరకద్ర	23	21	12,229	3,076
గండేడ్	27	23	7,457	1,586
హన్వాడ	35	31	12,933	4,490
జడ్చర్ల	45	40	14,195	2,100
కోయిలకొండ	44	39	15,727	6,184
కొకుంట్ల	12	16	5,298	1,509
మహబూబ్‌నగర్	26	28	13,931	3,922
మిడ్జిల్	24	24	9,416	2,118
మహమ్మదాబాద్	22	20	7,348	1,410
మూసాపేట	15	15	7,539	2,306
నవాబ్‌పేట	54	47	15,510	4,161
రాజాపూర్	24	22	7,164	2,037

మున్సిపాలిటీల్లో..

మున్సిపాలిటీ	వార్డులు	ని.స.	ఇ.వ.వ.ద.	ఇ.స.వ.
మహబూబ్‌నగర్	49	49	50,261	2,778
జడ్చర్ల	27	26	13,600	944
భూత్పూర్	10	8	3,969	670

ని.స.: నిర్వహించిన సభలు, ఇ.వ.వ.ద.: ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు, ఇ.స.: ఇతర సమస్యలపై వచ్చినవి

శిక్షణ కార్యక్రమానికి హాజరైన డాటా ఎంట్రీ ఆపరేటర్లు



సమాజాభివృద్ధిలో విద్యార్థులదే కీలకపాత్ర

మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: సమాజాభివృద్ధిలో ఉన్నత చదువులు చదివే విద్యార్థులదే కీలక పాత్ర అని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషల్‌వర్క్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు, సికింద్రాబాద్ పీజీ కళాశాల విద్యార్థులు ఫీల్డ్‌వర్క్‌లో భాగంగా కొల్లాపూర్‌లో పర్యటించేందుకు వచ్చారు. శుక్రవారం పీజీ కళాశాలలో వారికి ఫీల్డ్ విజిట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చెంచు, గిరిజన నివాస ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వచ్చిన విద్యార్థులకు మంత్రి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. క్యాంపు ఇన్‌చార్జ్ డాక్టర్.ఎస్.శంకర్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల భవనాన్ని పూర్తి చేస్తామని, త్వరలో కొత్త కోర్సులు కలిపి రాష్ట్రానికి తలమానికంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసి నాణ్యమైన విద్య అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఒకేషనల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. కళాశాలలో తాగు నీటి ఎద్దడి ఉందని, బెంచీల సమస్యలు ఉన్నాయని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రెండు రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి యెన్నం కళాశాల తరగతి గదులను పరిశీలించారు. ఎమ్మెల్యేను ఒకేషనల్ కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. సమావేశంలో డీఐఈఓ వెంకటేశ్వర్లు, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భగవంతాచారి, అధ్యాపకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరం సందర్శన

భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు సెట్విన్ సంస్థ, తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు అందిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ విద్య, వైద్య, ఉపాధి మీదనే అన్నారు. రాబోయే రోజుల్లో మహబూబ్‌నగర్ గొప్ప విద్యాకేంద్రంగా మారుతుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెట్విన్ సంస్థ ప్రతినిధులు సాధిక్, మాధురి, సూరిబాబు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణల డొంక కదిలేనా..!

- న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు
- భూ ఆక్రమణలపై జడ్చర్ల ఎమ్మెల్యే నజర్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన అనిరుధ్‌రెడ్డి



- వివరాలు 8లో..

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గోపాల్‌పేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన రేవల్లి మండలంలోని తల్పునూరులో శుక్రవారం వెలుగు చూసింది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేవల్లి మండలంలోని తల్పునూరుకు చెందిన వడ్డె నరసింహ(52) బుధవారం చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు వెతకగా.. స్థానికంగా ఉండే చెరువు సమీపంలో చెరువుగట్టుపై చెప్పులు, దుస్తులు కనిపించాయి. గురువారం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం నుంచి వెతకగా.. చెరువులో కనిపించాడు. మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అలంపూర్ ఆలయంలో భక్తుడి హఠాన్మరణం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని బయటకు వస్తున్న ఓ భక్తుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ప్రత్యక్షుల కథనం మేరకు.. స్థానిక కళాశాలలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ప్రిన్సిపల్ చంద్రకుమార్ (65) శుక్రవారం ఉదయం అలంపూర్‌లోని పాపనాశేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని బయటకు వస్తుండగా టెంకాయలు కొట్టే స్థలంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడే ఉన్న భక్తులు ఎంత పిలిచినా పలకలేదు. విషయం తెలుసుకున్న ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, పాలకమండలి సభ్యులు, ఈఓ పురేందర్‌కుమార్, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వివరించారు.

పెబ్బేరులోని నాలుగు దుకాణాల్లో చోరీ

- రూ.6లక్షల నగదు అపహరణ



పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీ కేంద్రంలోని నాలుగు దుకాణాల్లో చోరీకి పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా మార్కెట్ యార్డు షాపుల్లో రాత్రి గుర్తుతెలియని వ్యక్తి నాలుగు షెటర్ల తాళాలు పగలగొట్టి రూ.6 లక్షలు దోచుకెళ్లాడు. న్యూ వెంకటేశ్వర కిరాణంలో రూ.2.50లక్షల నగదు, తులం బంగారం, శ్రీరామ ట్రేడర్స్‌లో రూ.2లక్షల నగదు, శ్రీరామ మెడికల్ జనరల్ స్టోర్‌లో రూ.50వేల నగదు, శ్రీసాయి కిరాణం షాపులో రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం క్లూస్ టీం రప్పించి వివరాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని వనపర్తి ఎస్పీ రక్షిత కే.మూర్తి, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి పరిశీలించారు. దొంగను గుర్తించి పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తామని వారు తెలిపారు.

ఇద్దరి రిమాండ్

మన్ననూర్: చుక్కల దుప్పి మాంసం విక్రయించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అమ్రాబాద్ ఎఫ్‌డీఓ బత్తుల విశాల్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం సార్లపల్లికి చెందిన చిగుర్ల చిన్నలింగయ్య, మెండ్లి భీమయ్య వన్యప్రాణి మాంసాన్ని వటవర్లపల్లి గ్రామస్తులకు విక్రయించినట్లు సమాచారం అందించారు. దోమలపెంట అటవీశాఖ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. నిందితులు వేటాడి చంపిందే కాకుండా అటవీ ప్రాంతంలో మృతి చెందిన చుక్కల దుప్పి మాంసాన్ని వటవర్లపల్లిలో కొందరికి విక్రయించారని రుజువైందన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని అచ్చంపేట సివిల్‌కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు కల్వకుర్తికి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

దేవాలయంలో చోరీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని దేవాలయంలో చోరీ అయిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రోజుమాదిరి పూజలు నిర్వహించి గురువారం రాత్రి మూసివేశారు. శుక్రవారం ఉదయం పూజారులు దేవాలయానికి వెళ్లగా అప్పటికే ప్రధానద్వారం తలుపులు తెరచిఉండటంతో దొంగతనం జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని, దేవాలయంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి దేవాలయ గోడ దూకి వస్తున్నట్లు సీసీ కెమెరాలలో నిక్షిప్తం అయినట్లు రికార్డయింది. జిల్లా కేంద్రం నుంచి క్లూస్‌టీం అధికారులు వచ్చి వేలిముద్రల నమూనాలను సేకరించారు. వేంకటేశ్వర స్వామి విగ్రహం వద్ద ఉన్న పంచలోహ లక్ష్మీదేవి విగ్రహం, సుమారు 20 తులాల వెండి, ఇతర మంగళహారతులు ఇచ్చే పలు పూజాసామాగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

భూ ఆక్రమణల డొంక కదిలేనా..?

- న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నజర్
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తదితరులు

జడ్చర్ల: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలోని జడ్చర్ల నియోజకవర్గం ఓ వైపు 44వ నంబర్ జాతీయ రహదారి, మరో వైపు 167 నంబర్ జాతీయ రహదారి, రైల్వే డబ్లింగ్ లైన్ సౌకర్యాలతో పాటు పోలేపల్లి సెజ్, తదితర పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతుంది. దీంతో ప్రభుత్వ భూములతో పాటు లిటిగేషన్ ఉన్న భూములు, ప్లాట్లపై భూ బకాసురులు దృష్టిసారించి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. రికార్డులు, తదితర దస్తావేజుల్లోని లొసుగులను ఆధారం చేసుకుని భూ మాఫియా చెలరేగిపోయింది. కోర్టుల్లో కేసులు, లింకులు లిటికేషన్లు, తదితర ఇబ్బందులు సృష్టిస్తున్నారు. జడ్చర్ల పట్టణంతో పాటుగా చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఊర్కొండ, రాజాపూర్, బాలానగర్ మండలాల్లో సైతం భూ బకాసురులు చెలరేగిపోయారు. రాత్రికి రాత్రే ప్లాట్లు, భూములు ఆక్రమించిన పరిస్థితి ఉంది. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో భూ బాధితుల ఆశలకు ఊపిరి పోసినట్లయ్యింది. గతంలో వివిధ కారణాలుగా కోల్పోయిన భూములు, ప్లాట్లు తమకు దక్కుతాయనే ధీమాతో ఎదురుచూస్తున్నారు.

ఎందెందు వెతికినా అక్రమాలే..

జడ్చర్ల– మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని అనుసరించి హౌసింగ్‌బోర్డు కాలనీ ఎదుట ఉన్న వెంచర్లలో 30 సంవత్సరాల కిందట కొనుగోలు చేసిన ప్లాట్లను సైతం ఆక్రమించి అమ్మేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ ప్లాట్లు కబ్జాదారుల చేతుల్లోకి మారాయి. తమ చేతుల్లో రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఉన్నా ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని బాధితులు వాపోతున్నారు. కొందరు రూ.లక్ష, రూ.2లక్షలు తీసుకుని తమ ప్లాట్లను కబ్జాదారుల చేతుల్లో పెట్టిపోగా, మరికొందరు తమ ప్లాట్ల కోసం అధికారులు, పాలకులు, ప్రతిపక్ష పార్టీల చుట్టూ ఇంకా తిరుగుతున్నారు. కావేరమ్మపేట, మాచారం శివార్లలోని వెంచర్లలో అమ్మిన ప్లాట్లను సైతం ఆక్రమించి వ్యవసాయ భూమిగా మార్చి, తిరిగి రిజిస్ట్రేషన్ చేసి మళ్లీ ప్లాట్లుగా విక్రయించిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. అదేవిధంగా 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి సర్వే నంబర్లు 427, 430, 431 మాచారం శివారులోని సర్వే నంబర్లు 128, 129లోని వెంకటమణ, బాలాజీ, జూబ్లిహిల్స్ వెంచర్లలో ఇబ్బందులు సృష్టిస్తున్నారని ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త బస్టాండ్ సమీపంలోని ప్లాట్లను కొందరు దౌర్జన్యంగా ఆక్రమించి కొత్తగా వెంచర్ ఏర్పాటు చేశారు.



జడ్చర్లలో వెంచర్ బాధితులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త రవీందర్(ఫైల్)

- ఇటీవల నక్కలబండ తండా సమీపంలో 102/18లోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించేందుకు చదును చేసే పనులు చేపట్టాడు. దీంతో తండావాసులు తిరగబడి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా బూరెడ్డిపల్లి, మల్లెబోయిన్‌పల్లి శివార్లలో ఏర్పాటు చేసిన ఓ భారీ వెంచర్‌లో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు ఆక్రమణకు గురయ్యాయి. పెద్దపల్లి గ్రామశివారులో ఏర్పాటు చేసిన ఓ పరిశ్రమలో సైతం అసైన్డ్ భూములు ఉన్నాయి.

రికార్డుల్లో లొసుగులు..

రెవెన్యూ రికార్డులు, తదితర సర్వే కొలతల్లో లొసుగులు ఆధారం చేసుకుని ఆక్రమణలకు భూ మాఫియా తెరలేపుతుంది. యజమానుల నుంచి భూములను కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు తదుపరి రికార్డుల్లో తమ పేరున పట్టా మార్పిడి చేసుకోకుండా నేరుగా వెంచర్లను ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించారు. అయితే ప్రభుత్వం ధరణిని అమలులోకి తీసుకురావడంతో గతంలో వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయించినా మళ్లీ ధరణిలో మొదటి పట్టాదారుల పేర్లు రావడంతో అక్రమాలకు తావిచ్చినట్లయ్యింది. తమ తాతలు, తండ్రులు అమ్మిన భూములపై తిరిగి వారసులు తిరగబడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

ఉన్నతాధికారులు అడిగితే పరిశీలిస్తాం

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చేసిన ఫిర్యాదుకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులు తమను ఆదేశిస్తే రికార్డులు పరిశీలించి నివేదికను సమర్పిస్తాం. ఇప్పటి వరకు తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్ రాజాపూర్

భూ అక్రమాలను విచారిస్తాం



నియోజకవర్గంలో జరిగిన భూ అక్రమాలను విచారించి చర్యలు చేపడుతాం. రాజాపూర్, బాలానగర్, జడ్చర్ల, ఊర్కొండ మండలాల్లో ఇనాం, అసైన్డ్ భూములు, దేవాలయ తదితర భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఎస్సీ, ఎస్టీ తదితరులకు ప్రభుత్వం ఇచ్చిన భూములపై విచారిస్తాం. ఓఆర్సీ, ఎన్‌ఓసీ వంటి ధ్రువీకరణలు ఎవరు ఎలా ఇచ్చారనే వాటిపై కూడా విచారించి వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడుతాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

మంత్రి పొంగులేటిని కలిసి ఫిర్యాదు

నియోజకవర్గంలో జరిగిన భూ అక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టి సారించారు. అందులో భాగంగానే ప్రభుత్వం దళిత, గిరిజనులకు దశాబ్దాల కిందట ఇచ్చిన భూములను అక్రమంగా వారి నుంచి లాక్కున్నారని, ఆయా భూములపై సమగ్ర విచారణ చేపట్టి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్, దొండ్లపల్లి, చొక్కంపేట గ్రామాల శివార్లలోని సర్వే నంబర్లు 30, 31, 44, 113, 108, 114, 107, 110, 100, 97, 83, 85, 117, 116, 115, 118, 88, 151లో దాదాపు 240 ఎకరాలకు సంబంధించి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఓఆర్సీ తీసుకొచ్చి రియల్ వ్యాపారులకు విక్రయించి పెద్దఎత్తున వెంచర్లు ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూముల లావాదేవీలు, రికార్డుల తారుమారుపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మంత్రి పొంగులేటిని కోరారు.

యాంత్రీకరణ పద్ధతిలో సాగు చేస్తే మేలు

పాలెం నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త వాణిశ్రీ



అమ్మాపురంలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నచింతకుంట: రైతులు యాంత్రీకరణ పద్ధతిలో పంటలను సాగు చేస్తే అధిక లాభాలు పొందుతారని పాలెం నూనెగింజల శాస్త్రవేత వాణిశ్రీ సూచించారు. శుక్రవారం మండలంలోని అమ్మాపురంలో రైతు నాగరాజు పొలంలో పాలెం, కేవీకే కేంద్రం మదనాపురం ఆధ్వర్యంలో వేరు శనగ పంటను తీసే యంత్రం క్షేత్ర పరిశీలన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాలన్నారు. ప్రస్తుతం యంత్రాలతో వ్యవసాయం చేసుకునేందుకు అనువుగా ఉందన్నారు. కూలీల కొరతను అధికమించవచ్చని వివరించారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలతో వ్యవసాయం చేస్తే పెట్టుబడి తగ్గి దిగుబడి పెరిగి లాభాల బాటలో పయణిస్తారన్నారు. రెండు పంటలు వరి సాగు చేయరాదని సూచించారు. అలా చేయడం వల్ల నేల స్వభావం మారి సౌడు నేలగా మారుతుందన్నారు. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పాలెం శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణ్‌కుమార్, నవత, మస్తానయ్య మాట్లాడుతూ రైతులు పంటల సాగుపై శాస్త్రవేతల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పంటపొలాలకు ఎరువులు, నీటివాడకంపై శాస్త్రవేతలు విజయలక్ష్మి, స్రవంతి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ రాజేష్ ఖన్న, ఏఈఓ సంతోష్, చిన్నచింతకుంట, నర్వ, కొకుంట్ల, దేవరకద్ర, మదనాపురం మండలాల రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీపీ



ఎంపీపీ కృష్ణానాయక్‌తో ఎమ్మెల్యే మేఘారెడ్డి వాదన

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆరోపణలు.. అడ్డుపడిన ఎంపీపీ
- ఇరువర్గాలను కట్టడి చేసిన పోలీసులు

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం రోడ్డుమీదితండాలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఖిల్లాఘనపురం ఎంపీపీ కృష్ణానాయక్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను కట్టడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం మండలంలోని అల్లమాయపల్లి సమీపంలో సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి ముందు ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి ఎస్‌ఈ నాగేంద్రకుమార్, డీఈ నరేంద్రకుమార్‌తో మాట్లాడారు. గతంలోనే సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కదా.. మళ్లీ ఎందుకని ప్రశ్నించారు. అక్కడే ఉన్న సల్కెలాపురం సింగిల్‌విండో డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి కలగజేసుకొని ఎంపీపీకి అడ్డుగా మాట్లాడటంతో ఇరువురి మధ్య గొడవ పెరగగా ఎస్‌ఐ శ్రీహరి వెంటనే ఎంపీపీని పక్కకు తీసుకెళ్లి నచ్చజెప్పారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం రోడ్డుమీదితండాలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు అక్కడికి బయలుదేరారు. ముందుగా ప్రజాపాలన గ్రామసభలో ఎంపీపీ కృష్ణానాయక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంతో పాటు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి గిరిజనుల కోరిక మేరకు తండాలను గ్రామ పంచాయతీలు చేసి మన తండాలను మనమే పాలించుకొనేలా చేశారని ప్రసంగిస్తుండగా కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రసంగాన్ని అడ్డుకున్నారు. జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతుండగా పలువురు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడ్డారు. చివరకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రసంగం ప్రారంభించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనను నియోజకవర్గానికి వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారే గాని భూ ఆక్రమణలు, దోచుకోమని చెప్పలేదన్నారు. అక్కడే ఉన్న ఎంపీపీ కల్పించుకొని మీరు కూడా మంత్రి వెంటే ఉన్నారు కదా.. కాల్వలు తవ్వింది మీరే కదా ఎంత దండుకున్నారని ప్రశ్నించారు. ఈ సమయంలో ఎమ్మెల్యేకు ఎంపీపీకి తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో పలువురు నాయకులు, కార్యకర్తలు వేదిక వద్దకు చొచ్చుకు రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్రమత్తమైన ఎస్‌ఐ శ్రీహరి సిబ్బందితో కలిసి ఇరువర్గాలను అదుపు చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో చేసేది లేక జెడ్పీ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ పీన్యానాయక్ తదితర బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను సభా ప్రాంగణం నుంచి దూరంగా తీసుకెళ్లారు. కాసేపటికి పోలీసులు అందరికి నచ్చజెప్పి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు

గుప్తనిధులకు తవ్వకాలు



కురుమూర్తి స్వామి పురాతన ఆలయంలో చేపట్టిన తవ్వకాలు

దేవరకద్ర రూరల్: కొకుంట్ల మండల కేంద్రంలోని పిల్లిగుండ్ల వద్ద ఉన్న పురాతన కురుమూర్తి స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఉదయం ఆలయంలో గుంతలు తవ్వి ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. గతంలో ఇక్కడ కురుమూర్తి రాయుడి తిరుణాలకు సంబంధించి కార్యక్రమాలు జరిగేవని, కాలక్రమేణా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇక్కడ ఎలాంటి పూజలు జరగడంలేదన్నారు. దీనిని గమనించిన దుండగులు పురాతన ఆలయంలో నిధులు ఉండవచ్చనే ఆశతో తవ్వకాలు చేపట్టి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటేష్ తెలియజేశారు.

ఉద్యోగం వదిలి.. పూల తోట సాగు

రాజాపూర్: శుభకార్యాలు, పూజలు తదితర కార్యక్రమాలకు పూలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. పూల వ్యాపారులు హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల నుంచి పలు రకాల పూలను దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని గమనించిన ఓ యువకుడు తానే పూలతోటల సాగును ఎంచుకుని వాటిని నేరుగా దళారులు లేకుండా పూలు అవసరమున్నవారు అమ్ముతున్నాడు. రాజాపూర్ మండలంలోని రాయపల్లికి చెందిన కిష్టారం నవీన్‌గౌడ్ బీటెక్ ఈసీఈ పూర్తి చేయడంతో పాటు పాలమూరు యునివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశాడు. అనంతరం ఉద్యోగ అన్వేషణ చేసినా ఫలితం లేకపోవడంతో తమకున్న సొంత పట్టా పొలంలో రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టి బెంగళూరు నుంచి మొక్కలను తెప్పించి ఎకర గులాబీ, ఎకరన్నర చామంతి సాగు చేస్తున్నాడు.



రాయపల్లిలో చామంతి సాగు చూపిస్తున్న యువ రైతు

మక్కువతోనే పూలసాగు చేస్తున్నా..

ఈసీఈ, ఎంబీఏ పూర్తి చేశా, మా గ్రామ శివారులో ఉన్న సెజ్‌లోని ఓ పరిశ్రమలో రెండేళ్లు పనిచేశా అనుకున్నంత జీతం రాలేదు. అందరి రైతుల్లా కాకుండా పూలసాగుచేస్తే ఎలా ఉంటుందని ఆలోచనతో సాగుపై వరి, మొక్కజొన్న, పత్తి ఇతర పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. పూలసాగుపై శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో తోటలను పరిశీలించి, మా పొలంలో కూడా మొదలుపెట్టా. బెంగళూరు నుంచి గులాబి రూ.20 ఒక మొక్క, చామంతి రూ.5 ఒక మొక్కను తీసుకొచ్చి సాగు చేశా. రూ.1.50లక్షల వరకు ఖర్చు చేసి డ్రిప్ ఏర్పాటు చేసుకున్నా. పంటలు చేతికొచ్చాయి.. తెలిసిన వారు, పూలవ్యాపారులు ఆర్డర్లు ఇస్తున్నారు. అంతేకుండా పూలతోటలో కొంతమందికి ప్రతి రోజు ఉపాధి లభిస్తుంది.

– కిష్టారం నవీన్‌గౌడ్, యువ రైతు, రాయపల్లి

పోమాల్ సర్పంచ్ సస్పెన్షన్

నవాబుపేట: మండలంలోని పోమాల్ సర్పంచ్ కృష్ణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈఓపీఆర్డీ భద్రూనాయక్ శుక్రవారం తెలిపారు. నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై ఏడాది కిందట సస్పెండ్ చేసిన అధికారులు 5 నెలల క్రితం తిరిగి నియమించారు. నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలు ఆరు నెలల్లో అందించాలని సూచించగా.. నేటికీ స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మరోమారు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. కాగా సర్పంచ్‌ల పదవీ కాలం మరో 25 రోజులు సైతం సరిగా లేని తరుణంలో సస్పెండ్ చేయడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మిరపలో వైరస్ తెగులు



సాగులో ఉన్న మిర్చి పంట

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: జిల్లాలో బోరుబావులు, బోరుమోటార్లు, కాల్వల కింద రైతులు మిరప పంట సాగుచేశారు. మిరప పంట కాయ దశలో ఉంది. రైతులు కష్టపడి పండించిన మిరప పంటకు రసం పీల్చే పురుగు ఆశిస్తున్నట్లు వ్యవసాయ ఏడీఏ సక్రియ నాయక్ సూచిస్తున్నారు. వీటి ఉధృతి ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రధానంగా తెల్లదోమతో వైరస్ తెగుళ్ల ఆశిస్తుందని వివరిస్తున్నారు.

వైరస్ తెగులు..

వైరస్ తెగుళ్ల ఉధృతికి తెల్లదోమ ప్రధాన కారణంగా పనిచేస్తోంది. ఈ దోమ ఆకుల నుంచి రసం పీల్చడం ద్వారా పంటలో తెగుళ్ల ఉధృతి అధికమవుతోంది.

వైరస్ తెగులు రకాలు..

మిరప పంటను ఆశించే వైరస్ తెగుళ్ల ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి.

1. జెమిని వైరస్. 2. కుకుంబర్ మొజాయిక్ వైరస్

జెమిని తెగులు సోకితే..

జెమిని వైరస్ సోకితే ఆకులు చిన్నవిగా మారి పైకి ముడుచుకొని పడవ ఆకారంలోకి మారుతాయి. ఆకుల మీద బొబ్బలు ఏర్పడి ముడుచుకుంటాయి. మొక్కల ఎదుగుదల లోపించి గిడసబారిపోతాయి. పూత ఉండదు. ఈనెల మధ్య పసుపు పచ్చగా మారి కనుపుల మధ్య దూరం తగ్గుతుంది.

కుకుంబర్ మొజాయి సోకితే..

కుకుంబర్ మొజాయి వైరస్ సోకితే నల్లని మసి లేదా బూజు ఆకులపై కనిపిస్తోంది. మొక్కలు గిడసబారి ఎదుగుదల లోపిస్తుంది. ఆకులు పచ్చదనం కోల్పోయి ఆకారం మారి కొనలు సాగుతాయి. పూత, కాయ ఉండదు.

సస్యరక్షణ..

మిరప పంటను పప్పు జాతి పంటలైన పెసర, అలసందలు, చిక్కుడు మొదలగు వాటితో పంట మార్పిడి చేయాలి.



వైరస్ తెగులు సోకిన మొక్క

- వైరస్ సోకిన మొక్కలను పొలంలో గమనిస్తే ఎప్పటికి అప్పుడు తీసివేయాలి.
- వైరస్ తెగులు మందు లేదు. దానిని వ్యాప్తి చేసే తెల్లదోమ, పేను బంకలను నివారించుకోవాలి.
- పొలం మధ్యలో పసుపు అట్టలతో అట్టలకు గ్రీసు గాని లేదా ఆముదం నునె పూసి ఉంచితే తెల్లదోమ ఉధృతి గణనీయంగా తగ్గించవచ్చు.
- మిరప పంట చుట్టూ 3 లేదా 4 సాళ్లు జొన్న, మొక్కజొన్న పంటలకు కంచె పంటలుగా వేసుకుంటే వైరస్‌ను వ్యాప్తి చేసే తెల్లదోమ, పేను బంక పురుగుల వ్యాప్తిని తగ్గించవచ్చు.
- వేప నూనె 4 మిల్లీలీటర్లు, లీటరు నీటిలో కలిపి 3 నుంచి 4 సార్లు పిచికారీ చేసుకుంటే పేనుబంక, తెల్ల దోమ ఉధృతి తగ్గించుకోవచ్చు.

పేనుబంక, తెల్లదోమ నివారణకు..

అసిటామి ప్రిడ్ 0.3 గ్రాములు, ఇమిడా క్లోప్రిడ్ 0.3 గ్రాములు, డైఫెన్ ధురాన్ 1.5 గ్రాములు థయామి థాక్సాన్ 0.2 గ్రాములు, ట్రయజోఫాస్ 2.0 మి.లీ లీటరు నీటిలో కలుపుకొని ఆకుల పైభాగం, కింది భాగం బాగా తడిసేలా పిచికారీ చేసుకోవాలి. పిచికారీ సాయంత్రం లేదా ఉదయం వేళలో మాత్రమే చేయాలి.

కాంగ్రెస్ గూటికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కోస్గి: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు హైద్రాబాద్‌లోని ముఖ్యమంత్రి సోదరుడు పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు కౌన్సిలర్ మాస్టర్ శ్రీనివాస్, 12వ వార్డు కౌన్సిలర్లు బాలేష్ పార్టీలో చేరగా పార్టీ కండువా వేసి పార్టీలో చేర్చుకున్నారు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు అన్న కిష్టప్ప, కోడిగంటి హరి, బాల్‌రాజ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ టాప్

- పదో స్థానంలో తెలంగాణ
- రాజ్యసభ స్థాయీ సంఘం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: 'ఆయుష్మాన్ భారత్'లో భాగంగా పేదల ఆరోగ్యానికి చేస్తున్న ఖర్చులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్‌లో ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఒక నివేదిక కూడా విడుదల చేసింది. 2022–23లో ఏపీ ప్రభుత్వం రూ.3,338 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొంది. రూ.2,623 కోట్లతో గుజరాత్ రెండోస్థానంలో, రూ.1,932 కోట్లతో మధ్యప్రదేశ్ మూడోస్థానంలో, రూ.1,724 కోట్లు ఖర్చు చేసి రాజస్తాన్ నాలుగోస్థానంలో ఉంది. రూ.1,155 కోట్లతో తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఏటా ఏపీలో ఆయుష్మాన్‌భారత్ పథకం కింద చేస్తున్న ఖర్చు పెరుగుతోంది. 2018–19లో రూ.415.94 కోట్లు, 2019–20లో రూ.1,409 కోట్లు, 2020–21లో రూ. 1,908 కోట్లు, 2021–22లో రూ.2,715 కోట్లు ఖర్చు చేసినట్టు ఆ నివేదిక పేర్కొంది. ఏపీలో 2022–23లో 15.42 లక్షలమంది లబ్ధిదారులుగా ఉన్నారు. లబ్ధిదారులపరంగా ఏపీ దేశంలో మూడోస్థానంలో ఉంది. 23.13 లక్షలతో కర్ణాటక మొదటిస్థానంలో ఉంది. రెండో స్థానంలో ఉన్న రాజస్తాన్‌లో 16.40 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. తెలంగాణ 5.59 లక్షల మందితో 10వ స్థానంలో ఉంది.

ఏ ఆరోగ్యబీమా లేనివారు 30 శాతం

దేశంలో ఏ ఆరోగ్యబీమా అందనివారు 30 శాతం ఉన్నారు. వారంతా మధ్యతరగతి ప్రజలేనని రాజ్యసభ ఆరోగ్యస్థాయీ సంఘం నివేదిక తెలిపింది. 51 శాతం మంది ప్రభుత్వ పథకాలతో నేరుగా ఆరోగ్య బీమా అందుకుంటున్నారు. 10 శాతం మంది సామాజిక ఆరోగ్య బీమా పథకాలు అంటే ప్రభుత్వ ఉద్యోగులు, ఈఎస్ఐ ద్వారా లబ్ధిపొందే కార్మికులు ఉన్నారు. 9 శాతం మంది ప్రైవేట్ ఆరోగ్య బీమా పథకాల్లో ఉన్నారు. ఆయుష్మాన్ భారత్‌ను ఒకట్రెండు మినహా అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. ఇప్పటికే 23 రాష్ట్రాల్లో ఏదో ఒక స్థానిక ఆరోగ్య పథకాలున్నాయి. వాటిని ఆయుష్మాన్ భారత్‌తో కలిపి చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ కింద అయ్యే ఖర్చులో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.

ఆరోగ్య ఖర్చుల ద్రవ్యోల్బణం 14 శాతం

దేశంలో ఆరోగ్య ఖర్చుల ద్రవ్యోల్బణం ఏటా 14 శాతం. ఇది ప్రపంచంలోనే ఎక్కువ. ప్రభుత్వం ఆరోగ్యంపై పెట్టే ఖర్చు జీడీపీలో రెండు శాతమే. ఇది ప్రపంచంలోనే అత్యల్పం. ప్రపంచసగటు 10 శాతంగా ఉంది. అందరికీ ఆరోగ్యబీమా అందజేయాలంటే ప్రభుత్వ కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ బీమా పథకాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల భాగస్వామ్యం పెంచాలి. ఇది జరగాలంటే కవరయ్యే వ్యాధుల సంఖ్య పెంచి ప్యాకేజీ రేట్లు కూడా ఎప్పటికప్పుడు సవరించాలి. అప్పుడు పేద రోగులకు ప్రయోజనం కలుగుతుంది.

– డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

నారా దారి.. అడ్డదారి

ఊతకర్రల సాయంతో చంద్రబాబు దింపుడుకళ్లం ఆశలు

ఎన్నికల వేళ జగన్‌ను ఎదుర్కోవటానికి కుట్రలు కొత్త పుంతలు

- అన్ని పార్టీలూ తన అవసరాల కోసమే మోహరింపు.. కాంగ్రెస్, బీజేపీని తన మనుషుల ద్వారా నడిపిస్తున్న వైనం
- అవసరమైనప్పుడల్లా పార్టీలకు ఇం'ధనం'.. ప్రత్యేక విమానాల సేవలు
- శిష్యుడు రేవంత్ సహా తెలంగాణ నేతల అందరినీ కాంగ్రెస్ గూటికి చేర్చిన బాబు
- ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక సీఎం పీఠంపై కూర్చోవడానికీ సహకారం..

నిజం చెప్పడు... నేరుగా పోరాడడు.. అవకాశవాదమే కాదు అలవోకగా అబద్ధాలాడేసే నైజం. ఇచ్చిన మాటంటే లెక్క ఉండదు. ఏరు దాటాక తెప్పని బూడిద చేసి నీట్లో కలిపేసే రకం. అధికారం కోసం దేనికైనా రెడీ. శత్రువుల కాళ్లు పట్టుకోవటానికైనా... మిత్రుల కాళ్లు నరికేయడానికైనా...!! ఎంతసేపూ... తనకు ఎవరు, ఎలా ఉపయోగపడతారనే యావే. బహుశా! ఆధునిక రాజకీయాల్లో నారా చంద్రబాబు నాయుడి లాంటి నాయకుడెవరినీ చూడలేం. పురాణాల్లోనూ ఇలాంటి పాత్ర కనిపించదు. ఎందుకంటే వాటిలోని పాత్రల లక్షణం ఒక్కటీ ఈయనలో ఉండదు. ఈయనకున్న అవ లక్షణాలు పురాణాల్లోని ఏ ప్రతినాయకుడికీ ఉండవు. కానీ చంద్రబాబులోని ఈ అవలక్షణాలన్నిటికీ విజన్... చాణక్యం... వ్యూహ చాతుర్యం.. దార్శనికత.. అనే అందమైన ముసుగులేసి ఆయనో ఘనమైన నాయకుడని నమ్మించింది ఓ వర్గం మీడియా. బాబు మినహా అధికారంలో ఎవరున్నా... ఈ రాష్ట్రం నాశనమైపోతోంది.. దివాలా తీసేసింది... అంటూ విష్రప్రచారం చేస్తుందీ మీడియా. వీళ్ల దృష్టిలో బాబు ఏం చేసినా... అది రాష్ట్ర ప్రయోజనాల కోసమే. ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా... ప్రజాస్వామ్యం కోసమే!!. ఔరా.. ఇంత దౌర్భాగ్యమా??

ఇలా నిలువెల్లా దుర్మార్గాన్ని, విషాన్ని నింపేసుకున్న 63 కిలోల.. 73 ఏళ్ల చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవటానికి కుతంత్రాలను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ప్రజాబలం లేక ఓటమి తరుముకొస్తుండటంతో వాటిని పతాక స్థాయికి చేరుస్తున్నారు. ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన సీఎం జగన్‌ను తను, తన పార్టీ ఏమీ చేయలేమని తెలుసు గనక జనసేన, సీపీఐ, సీపీఎం లాంటి పార్టీలన్నిటినీ కూడగడుతున్నారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ కూడా... తనకు అనుకూలంగానే పనిచేసేలా వాటిలోని తన మనుషుల ద్వారా ఆపరేట్ చేస్తున్నారు. 2019లో చంద్రబాబు ఓడిపోగానే ఆయన ఆదేశాల మేరకు బీజేపీలోకి ఫిరాయించిన సి.ఎం.రమేశ్, సుజనా చౌదరి ఇప్పటిదాకా బాబు–బీజేపీలను కలపటానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. సి.ఎం.రమేశ్ ఓవైపు ఆ పని చేస్తూనే మరోవైపు బీటెక్ రవిని రంగంలోకి దింపడంతోపాటు వైఎస్ షర్మిలకు ప్రత్యేక విమానాలు సమకూర్చి సేవలందిస్తున్నారు. చంద్రబాబు కాంగ్రెస్‌లోకి పంపిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావటంతో టీడీపీ–కాంగ్రెస్ సంబంధాలు మరింత బలపడ్డాయి. నిజానికి కాంగ్రెస్ పార్టీ ద్వారా వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు బనాయించిన నాటి నుంచి హస్తంతో చంద్రబాబు అక్రమ బంధం కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ వ్యూహకర్తగా తన సామాజిక వర్గానికే చెందిన సునీల్‌ను నియమించి తెరచాటున పనులు చక్కబెడుతున్నారు. చంద్రబాబు ఎవరెవరిని ఎలా వాడుకుంటున్నారో ఒక్కసారి చూద్దాం...

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటం, గత ఎన్నికలకు మించి ఘోర పరాజయం గోచరిస్తుండటంతో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధికారంపై దింపుడు కళ్లం ఆశలతో అరాచకత్వానికి పాల్పడుతున్నారు. గత ఎన్నికల్లో అధికారాన్ని కాపాడుకునేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌తో విడిగా పోటీ చేయించిన చంద్రబాబు ఇప్పుడు అధికారం కోసం అర్రులు చాస్తూ జనసేనతో జత కలిశారు. తెలంగాణలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని ఆపార్టీకి ఇం'ధనం'సమకూర్చిన చంద్రబాబు ఆ ఎన్నికల్లో ఓడిపోయాక అక్కడ టీడీపీ నేతలందరినీ 'హస్త'గతం చేశారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తనకు అత్యంత సన్నిహితులైన రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, సుజనా చౌదరి లాంటి వారిని బీజేపీలోకి పంపి అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం రమేష్ ద్వారా ప్రత్యేక విమానాలను సమకూరుస్తూ కుట్రలకు పదును పెట్టారు. తన శిష్యుడైన రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపి నోట్ల కట్టలు వెదజల్లి పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టేలా చేసిన చంద్రబాబు ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాక మరోసారి ఇం'ధనం'సమకూర్చి సీఎం పీఠంపై కూర్చోవడానికి సహకరించారు. కాంగ్రెస్‌కు వ్యూహకర్తగా పని చేస్తున్న సునీల్ కనుగోలు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. చంద్రబాబు చెప్పినట్లు ఆడేందుకు, బాబు ప్లాన్‌ను అమలు చేసేందుకు ఆయన సదా సిద్ధంగా ఉంటారు.



పరాకాష్టకు కుట్రలు, కుతంత్రాలు..

సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ రోజుకు రోజుకు పెరుగుతోందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25కు 25 లోక్‌సభ స్థానాల్లో ఆపార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని టైమ్స్ నౌ లాంటి జాతీయ మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడైంది. ప్రజల విశ్వాసాన్ని చంద్రబాబు పూర్తిగా కోల్పోవడంతో టీడీపీ ఉనికి కూడా చాటుకోలేదని ఆ సర్వేలు తేల్చి చెప్పాయి. గత ఎన్నికల కంటే ఘోర పరాజయం తప్పదని పసిగట్టిన చంద్రబాబు అడ్డదారి పట్టారు. అనాదిగా మైనార్టీలు కాంగ్రెస్ వెనుకే ఉంటారన్న ఓ పాచిపోయిన భావనను తనకు అనుకూలంగా మార్చుకోవాలన్నది ఆయన ఎత్తుగడ. వైఎస్సార్‌సీపీలో టిక్కెట్ దక్కని వారికి తన శక్తుల ద్వారా కాంగ్రెస్ టికెట్లు ఇప్పించి ఇం'ధనం'సమకూర్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది బాబు ప్లాన్. ఒకవైపు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను చీల్చడం.. మరోవైపు బీజేపీ వ్యతిరేక ఓటు వైఎస్సార్‌సీపీకి దక్కకుండా చేయడం దీని వెనుకున్న మరో ఎత్తుగడ. ఇలా ఓవైపు కాంగ్రెస్‌ను తానే నడుపుతూ స్వార్థానికి వాడుకోవడమే కాకుండా.. ఇంకోవైపు బీజేపీని కూడా తన వైపు తిప్పుకుని అవినీతి కేసుల నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల్లో ఉన్న తన మనుషులు, తాను సృష్టించిన పాత్రల ద్వారా ఈ ఎత్తుగడలను అమలు చేసే ప్రణాళిక వేశారు.

శిథిలమైన కాంగ్రెస్‌తో శూన్యమే..

2014లో ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయంగా విభజించింది. విభజనతో పూడ్చలేని నష్టాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మిగిల్చింది. తరతరాలపాటు రాష్ట్ర ప్రజానీకాన్ని కోలుకోనివ్వకుండా దెబ్బ తీసింది. ఏపీకి తీరని అన్యాయం చేసింది కాబట్టే కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో ప్రజలు అధఃపాతాళానికి తొక్కేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు లభించగా నోటాకు 1.28 శాతం ఓట్లు రావడమే అందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శిథిలమైన కాంగ్రెస్ నుంచి చంద్రబాబు ఆశించే ప్రయోజనం ఒనగూరే అవకాశమే లేదని రాజకీయ పరిశీలకులు తేల్చి చెబుతున్నారు. హఠాన్మరణం తర్వాత కూడా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన పార్టీకి ఏపీలో ఎవరు నేతృత్వం వహించినా ప్రజలు మద్దతు ఇవ్వరని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

గోదావరి చెంతన తెలుగు సభల నిర్వహణ భేష్

ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

- ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- తొలి రోజు మూడు వేదికలపై సందడి చేసిన కవులు, కళాకారులు



జ్యోతి ప్రజ్వలనం చేసి సభలను ప్రారంభిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి చెంతన సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరంలో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయమని ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఇక్కడి గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాజరాజనరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, ఆదికవి నన్నయ భారతాన్ని ఆంధ్రీకరించి వెయ్యేళ్లయిన సందర్భంగా ఈ సభలు నిర్వహిస్తున్నారు. రాజరాజ నరేంద్రుడు, నన్నయ భట్టారక, నారాయణభట్టు వేదికలపై నిర్వహిస్తున్న ఉత్సవాలను గవర్నర్ విశ్వభూషణ్, విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. గవర్నర్ విశ్వభూషణ్ మాట్లాడుతూ.. సంస్కృతి, రచనలకు కేరాఫ్ అడ్రస్‌గా రాజమహేంద్రవరం విరాజిల్లుతోందన్నారు. అలాంటి గడ్డపై తెలుగు మహాసభలు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. కావ్యాలు, పురాణేతిహాసాలను తెలుగు వాళ్లు అనువదించినట్టు ఎవరూ చేయలేదన్నారు. తెలుగులో ఎన్నో యాసలు, ప్రాసలు, ఉపభాషలు ఉన్నాయన్నారు. పోతన భాగవతం, అన్నమయ్య కీర్తనల్లోని పదాలు చూస్తే ముచ్చటేస్తుందన్నారు. ఆర్‌ఎస్ఎస్ జాతీయ కార్యకారి వారణాసి రామ్‌మాధవ్, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కవి అందెశ్రీ, జేఎన్‌టీయూకే ఉప కులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ పాల్గొన్నారు.

ఇదేమి వాదన?

- వివేకా హత్య కేసులో సీబీఐపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం
- శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సీబీఐ న్యాయవాదిపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన సమాచారం లేకుండా 'ఐ థింక్ సో'అంటూ వాదనలు వినిపించడం సరికాదని చెప్పింది. వాదనలకు వచ్చే ముందే అధికారులు, ఇతర న్యాయవాదుల నుంచి సమాచారం తీసుకుని రావాలని వ్యాఖ్యానించింది. వైఎస్ వివేకా హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ గత నెల శివశంకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్యతో శివశంకర్‌రెడ్డికి సంబంధంపై సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టు చేసిందన్నారు. సీబీఐ చెప్పినట్లు దస్తగిరి(ఏ–4) వాంగ్మూలం ఇచ్చాడని.. అందుకే అతని బెయిల్‌కు దర్యాప్తు సంస్థ పూర్తిగా సహకరించిందని తెలిపారు. అనంతరం సీబీఐ తరఫున న్యాయవాది అనిల్ తల్వార్ వాదనలు వినిపించారు. శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. తీర్పు కాపీ ఉందా అని ప్రశ్నించారు. కనీసం ఎస్ఎల్‌పీ (పిటిషన్) నంబర్ అన్నా చెప్పండి అని అడగగా.. సీబీఐ న్యాయవాది నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. వాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేశారు.

కాంగ్రెస్‌లోకి మన్నె జీవన్‌రెడ్డి?

జడ్చర్ల: పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవనరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరుతారన్న ప్రచారం రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. మన్నె జీవన్‌రెడ్డి ప్రస్తుత మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సోదరుడి కుమారుడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జడ్చర్ల బీఆర్ఎస్ టికెట్ తనకే వస్తుందని ఆశించినా.. చివరకు రాకపోవడంతో ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ ఆయన పేరు తెరపైకి వచ్చింది. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జీవన్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సింగోటం ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్ రూరల్: సింగోటం శ్రీలక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని.. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలయ ఆవరణలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. రాయలసీమ భక్తుల కోసం కర్నూలు నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. అవసరమైతే సోమశిల, మంచాలకట్ట వద్ద టూరిజం శాఖకు చెందిన చిన్న బోట్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రథోత్సవం రోజున ప్రతి గ్రామం నుంచి బస్సు నడపాలని.. కొల్లాపూర్ డిపో నుంచేగాక ఇతర ప్రాంతాల నుంచి అదనపు బస్సులు తెప్పించాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్‌లు ఎక్కువగా అందుబాటులో ఉంచాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జాతర మైదానంలో ఉన్న ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేయాలని, గుండంలోని నీటిని ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలని చెప్పారు. కట్టపైన, కిందిభాగంలో విద్యుద్దీపాలను సమకూర్చాలని, జాతరలోని గుడారాల నిర్వహణను గ్రామపంచాయతీ సిబ్బంది చూసుకోవాలని డీఎల్‌పీఓను ఆదేశించారు. గుట్కా, గంజాయి తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. పెంట్లవెల్లిలో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని.. విచారణ జరపాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు మంత్రిని బ్రాహ్మణ సంఘం నాయకులు, హోంగార్డుల సంఘం నాయకులు సన్మానించి సమస్యల వినతిపత్రాలు అందజేశారు. సమీక్షలో పాల్గొనేందుకు మంత్రి ఆర్టీసీ బస్సులోనే సింగోటం గ్రామానికి వచ్చారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సీతారామరావు, ఆర్డీఓ నాగరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు భాగ్యమ్మ, సర్పంచ్ కృష్ణయ్య, తహసీల్దార్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు ఇమిడిశెట్టి వెంకటస్వామి, ఎల్లపోగు వెంకటస్వామి తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మైసమ్మ ఉత్సవాలు



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కాకర్లపహాడ్ గ్రామస్తులు

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆలయ చైర్మన్ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్ జంగమ్మ కాకర్లపహాడ్ నుంచి పాదయాత్రగా పట్టువస్త్రాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపాల్, సుభాన్, నారాయణరెడ్డి, రాజు, శ్రీనివాసాచారి, సర్పంచ్‌లు లక్ష్మమ్మ, సంజీవరెడ్డి, బాలయ్య, శ్రీనివాస్‌గుప్తా, మాధవులు, నరేందర్, గోపాల్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం →

అలంపూర్‌పై ప్రచారం కరువు

- పట్టించుకోని పర్యాటక శాఖ
- టూరిజం గైడ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్న భక్తులు



అలంపూర్ ఆలయ ప్రాంగణంలో భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: చారిత్రాత్మక కళాఖండాలు కలిగిన అలంపూర్ ఆలయాలకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఇక్కడి ప్రాంతంలో చూడదగ్గ స్థలాలపై సమాచారం ఇచ్చే వారు కరువయ్యారు. సందర్శనీయ స్థలాలను సూచించే సూచిక బోర్డులు కూడా ఇక్కడ అందుబాటులో లేవు. అలంపూర్ ఆలయాలకు నిత్యం భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. వీరంతా కేవడం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను మాత్రమే దర్శించుకోగలుగుతున్నారు. తక్కిన ఆలయాల గురించి తెలియక పోవడంతో వాటిని దర్శించుకోలేకపోతున్నారు. కేవలం 96 రోజులలో రూ.58 లక్షల హుండీ ద్వారా ఆదాయం లభించిందంటే భక్తులు ఇక్కడికి ఎంత మంది వస్తున్నారో అంచనా వేయవచ్చు.

సందర్శనీయ స్థలాలు ఇవే..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇదే ప్రాంగణంలో కంచి కామాక్షి, వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, నవబ్రహ్మ ఆలయాలు, అక్కడి నుంచి 200 మీటర్ల దూరంలో దత్తాత్రేయ స్వామివారి ఆలయం, సూర్యనారాయణ స్వామి, యోగ నారసింహ స్వామి, సంగమేశ్వర ఆలయాలు, 24 ఆలయాల సముదాయమైన పాపనాశేశ్వర స్వామి, కృష్ణా–తుంగభద్ర సంగమస్థానమైన ఝుంకారేశ్వర ఆలయం ఇలా అనేక ఆలయాలు ఇక్కడ ఉన్నాయి.

ప్రచారం కల్పించాలి



అలంపూర్ ఆలయాలను మేము అనేక సార్లు దర్శించాం.. కానీ ఇక్కడ జోగుళాంబ ఆలయంతో పాటు ఇంకా చాలా ఆలయాలు ఉన్నాయని తెలిసింది. వీటి గురించి ఎలాంటి ప్రచారాలు కల్పించకపోవడంతో వాటిని మేము దర్శించుకోలేకపోయాం. సందర్శనీయ ఆలయాలపై ప్రచారం కల్పిస్తే బావుంటుంది.

– అమరావతి, మహబూబ్‌నగర్


టూరిజం గైడ్‌ను ఏర్పాటు చేయాలి



ఇక్కడి ఆలయాలు, విలక్షణమైన శిల్ప సంపద, చారిత్రక నేపథ్యం అన్ని విషయాలను తెలియజేస్తూ టూరిజం గైడ్‌ను ఏర్పాటు చేయాలి. ఇక్కడి ఆలయాలు పర్యాటక క్షేత్రం అని చెబుతారే తప్ప పర్యాటక శాఖ నుంచి ఎలాంటి సౌకర్యాలు, సదుపాయాలు లేవు. ప్రభుత్వం అలంపూర్ లాంటి ఆలయాలను మరింత వెలుగులోకి తేవాలి.

– పద్మ, భక్తురాలు, నల్లగొండ

టూరిజం అధికారులు సహకరించాలి



జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయం విషయంలో టూరిజం శాఖ వారు మరింత దృష్టి సారించాలి. ఇక్కడ టూరిజం గైడ్‌ను ఏర్పాటు చేయాలి. వివిధ జిల్లాల నుంచి భక్తయాత్రికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి. ఇక్కడి సందర్శనీయ స్థలాలను తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ విషయంలో టూరిజం శాఖ మంత్రిని కలిసి దేవస్థానం నుంచి తగు వినతిపత్రం కూడా అందిస్తాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త

ఎంపీ టికెట్ కేటాయింపులో అధిష్టానం నిర్ణయమే ఫైనల్

- మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి

పాలమూరు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లను గెలిపిస్తే కేంద్రం నుంచి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు ఎంపీ టికెట్ విషయంలో అధిష్టానం నిర్ణయాన్ని శిరసావహిస్తానని తెలిపారు. ఈ నెల 22న జరిగే అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మహోత్సవంగా ప్రజలు జరుపుకోవాలన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం విద్య, వైద్యం ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను అన్నింటినీ కాళేశ్వరం ప్రాజెక్టుకు తరలించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పులు చేయడంతో పూర్తిగా అప్పుల పాలైందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధుల ఎక్కడి నుంచి వస్తా యన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బాలరాజు, సత్యం, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, జయశ్రీ, బుచ్చిరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామి హుండీ ఆదాయం రూ.2.53 కోట్లు

- గతేడాది కంటే రూ.31.55 లక్షలు అధికం



కురుమూర్తి స్వామి ఆలయం

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకొని స్వామివారి ఆలయానికి మొత్తం రూ.2,53,46,167 ఆదాయం సమకూరింది. నెలరోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగిన ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రంతోపాటు ఆంధ్ర, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి దాదాపు 10 లక్షల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకున్నారు. దీంతోపాటు ఆలయానికి అధిక ఆదాయం రాబట్టే దిశగా కృషిచేశారు. ఇందులో భాగంగా జాతరలో వివిధ రకాల వ్యాపారాలు కొనసాగించేందుకు టెండర్లు నిర్వహించారు. టికెట్ల ద్వారా భక్తులకు స్వామివారి ప్రత్యేక దర్శనాలు, హుండీ ఆదాయంపై ప్రధానంగా దృష్టిసారించడంతో భారీగా ఆదాయం సమకూరింది.

❒ 2023 సంవత్సరానికి గాను బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకొని మొత్తం రూ.2,53,46,167 సమకూరింది. ఇందులో అన్నిరకాల టెండర్ల ద్వారా రూ.1,72,56,000 డబ్బులు రాగా.. హుండీ ద్వారా రూ.66,04,407, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.14,85,760 వచ్చాయి. అయితే 2022 సంవత్సరంలో మొత్తం రూ.2,21,90,920 వచ్చింది. దీంతో 2022 సంవత్సరం కంటే 2023లో రూ.31,55,247 ఆదాయం అధికంగా వచ్చినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు.